సాక్షి తిరుపతి

శనివారం । 11 । జనవరి । 2025

ఇల వైకుంఠపురంలో..



స్వర్ణరథంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప (ఇన్‌సెట్) అంతరాలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ



తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం నేత్రపర్వంగా ప్రారంభమైంది. శుక్రవారం తెల్లవారుజామున అభిషేకం తర్వాత శ్రీవారి దర్శనానికి అనుమతి లభించింది. ఉత్తర ద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించి ఆ ఏడు కొండల వాడిని తనివితీరా దర్శించి భక్తులు పునీతులయ్యారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయ పరిసరాలతోపాటు అంతరాలయంలో ప్రత్యేక ఫల, పుష్పాలంకరణలు చేపట్టారు. విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. ఉభయదేవేరులతో కలిసి మలయప్ప స్వామి స్వర్ణరథాన్ని అధిరోహించి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ కనువిందు చేశారు. – తిరుమల



ప్రత్యేక ఫల, పుష్పాలంకరణలో రంగనాథస్వామి ఆలయం

న్యూస్‌రీల్

శేష వాహనంపై చిద్విలాసం



శేష, యాలి వాహనాలపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి శుక్రవారం శేష, యాలి వాహనాల్లో పురవిహారం చేశారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీకాళహస్తీశ్వర స్వామిని శేష వాహనంపై, జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని యాలి వాహనంపై అధిష్టింపజేసి పుర ఉత్సవానికి సాగనంపారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

జాగ్రత్తగా వెళ్లండి

–స్విమ్స్ నుంచి 32 మంది డిశ్చార్జ్



భక్తులను సాగనంపుతున్న కలెక్టర్, కమిషనర్

తిరుపతి అర్బన్: 'మీ ఊరికి జాగ్రత్తగా వెళ్లండి' అంటూ కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య స్విమ్స్ ఆస్పత్రిలోని క్షతగాత్రులకు వీడ్కోలు పలికారు. వైకుంఠ ద్వార దర్శన టిక్కెట్ల జారీ కేంద్రాల వద్ద తొక్కిసలాటలో క్షతగాత్రులై స్విమ్స్ ఆస్పత్రి చికిత్స పొందిన 32 మందిని శుక్రవారం డిశ్చార్జ్ చేశారు. ముందుగా వారికి శ్రీవెంకటేశ్వర స్వామి వారి దర్శనం చేయించి, అనంతరం వారిని తమ స్వగ్రామాలకు ప్రత్యేక వాహనాల ద్వారా తరలించారు. విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కడప, తిరుపూర్, కోయంబత్తూర్‌కు ప్రత్యేక వాహనాల్లో పంపించారు. మరో ఐదుగురు భక్తులు ఇంకా స్విమ్స్‌లోనే చికిత్స పొందుతున్నారు.

డీపీటీఓగా నరసింహులు



డీపీటీఓతో ఆర్టీసీ అధికారులు

తిరుపతి అర్బన్: డీపీటీఓగా జీ.నరసింహులును నియమిస్తూ ప్రభుత్వం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు చిత్తూరు డీపీటీఓగా పనిచేస్తున్న జగదీష్‌కు రెండు నెలల క్రితం తిరుపతి డీపీటీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో జిల్లా మెకానిక్ ఇంజినీర్ నరసింహులుకు ప్రభుత్వ పదోన్నతి కల్పించి తిరుపతి డీపీటీవో బాధ్యతలు అప్పగించింది. అయితే ఆయన వచ్చే ఏప్రిల్ 30న ఉద్యోగ విరమణ పొందనున్నారు. నూతన డీపీటీఓను డిప్యూటీ సీటీఎం విశ్వనాథంతోపాటు ఏటీఎం డీఆర్ నాయుడు, మంగళం డీఎం భాస్కర్, అలిపిరి డీఎం హరిబాబు, తిరుపతి డీఎం బాలాజీ తదితరులు అభినందించారు.

గోశాల షెడ్లు ప్రారంభం



గోశాల షెడ్డును ప్రారంభిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలంలోని 14 పంచాయతీలలో నిర్మించిన గోశాల షెడ్లను పల్లె పండుగ పేరుతో శుక్రవారం ఉపాధి హామీ మండల అధికారులు ప్రారంభించారు. ఎల్లమండ్యంలోని గోశాల షెడ్డు ప్రారంభోత్సవంలో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు. మండలానికి మొత్తం 22 మంజూరుకాగా.. అందులో 19 పూర్తయ్యాయని ఏపీవో జ్యోతిశ్రీ తెలిపారు. డ్వామా పీడీ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,391 గోశాల షెడ్లు మంజూరయ్యాయని, అందులో మూడు రోజుల్లో 700 షెడ్లు పూర్తిచేసినట్టు వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కోటి పది లక్షల పని దినాలు ఉపాధి కూలీలు చేయడం వల్ల మెటీరియల్ వర్కులకు రూ.200 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఆయన వెంట వెటర్నరీ డాక్టర్ రెడ్డెప్పరెడ్డి ఉన్నారు.

కల్లబొల్లి క్యాలెండర్



పెదబాబు దారిలోనే చినబాబు పయనిస్తున్నారు. ఇచ్చిన మాటను తుంగలో తొక్కడంలో తండ్రి అడుగుజాడలనే అనుసరిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం నోటికొచ్చినట్టు హామీలు గుప్పించారు. అందులో భాగంగానే యువగళం పాదయాత్రలో యువతకు ఉద్యోగాల పేరుతో కల్లబొల్లి కబుర్లు చెప్పారు. ''కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2025 జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం.. ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి నోటిఫికేషన్ల విడుదల సమాచారాన్ని అందులో పొందుపరుస్తాం. ఏటా క్రమం తప్పకుండా ఇదే విధానం కొనసాగిస్తాం.. రాసి పెట్టుకోండి తమ్ముళ్లా'' అంటూ నారా లోకేష్ ఊదరగొట్టారు.. అయితే ఇప్పుడు జనవరి 11వ తేదీ వచ్చినా జాబ్ క్యాలెండర్ ఊసే ఎత్తడం లేదు. ఖాళీ పోస్టుల భర్తీకి కనీస చర్యలు చేపట్టడం లేదు. దీనిపై విద్యార్థులు.. నిరుద్యోగులు మండిపడుతున్నారు.

- యువగళంలో నారా లోకేష్ ఊకదంపుడు ఉపన్యాసాలు
- జనవరి ఒకటో తేదీనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామంటూ ఆర్భాటాలు
- డేట్.. టైమ్ రాసి పెట్టుకోండంటూ ప్రగల్భాలు
- అధికారంలోకి వచ్చాక హామీ అమలుకు కుంటి సాకులు
- చినబాబు తీరుపై మండిపడుతున్న నిరుద్యోగులు
- ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదలతో పాటు టీటీడీలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్

తిరుపతి సిటీ: ఎన్నికల సమయంలో నిరుద్యోగుల ఓట్ల కోసం ప్రగల్భాలు పలికి, అధికారం చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీలను విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ గాలికొదిలేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావొస్తున్నా.. నిరుద్యోగ భృతి లేదు. ఒక్కటంటే ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. జాబ్ క్యాలెండర్ మాటే ఎత్తడం లేదంటూ నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నేతలు నిప్పులు చెరుగుతున్నారు.

జిల్లాలో ఖాళీ పోస్టుల వివరాలు

టీటీడీ 15,400	ఉపాధ్యాయులు 9,778
వర్సిటీలో అధ్యాపకులు 1,653	వైద్య ఆరోగ్యశాఖ 7,875
ఇతర ప్రభుత్వ శాఖలు	31,574

మోసం చేశారు



ఎన్నికలకు ముందు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో యువతకు అండగా ఉంటానంటూ చిలకపలుకులు వల్లించారు. ఏటా జనవరి ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ వివరాలతో జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి తీరుతామంటూ ఊక దంపుడు ఉపన్యాసాలు చేశారు. ఆయన మాటలు నమ్మి యువత ఓట్లు వేసి గెలిపించింది. ఇంతవరకూ నిరుద్యోగులను పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ విడుదల కాలేదు. మెగా డీఎస్సీ అంటూ తొలిసంతకం చేసి ఆ మాటే మరిచారు. ఉద్యోగాల కోసం రూ.లక్షలు వెచ్చించి కోచింగ్ తీసుకుంటున్న యువతను మోసం చేశారు.

– ఓబులిరెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు, తిరుపతి

రాసుకోండి.. అన్నారు



యువగళం పాదయాత్రలో భాగంగా పలు ప్రాంతాల్లో మహాసభలు నిర్వహించి కాగితంపై రాసుకోండి.. జాబ్ క్యాలెండర్ 2025 జనవరి ఒకటో తేదీన విడుదల చేసి తీరుతామన్నారు. జనవరి 9వ తేదీ వచ్చింది. ఆ ప్రస్తావనే లేదు. నిరుద్యోగ యువతను మోసం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేయడం దారుణం. జిల్లాలో వేలసంఖ్యలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. వాటిని ఎప్పుడు భర్తీ చేస్తారో మంత్రి లోకేష్ క్లారిటీ ఇవ్వాలి. లేదంటే నిరుద్యోగుల సమస్యలపై ఉద్యమిస్తాం.

– బండి చలపతి, రాష్ట్ర సహాయక కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్, తిరుపతి

పోరాటం తప్పదు



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా.. నిరుద్యోగ భృతి మాటే ఎత్తడంలేదు. జాబ్ క్యాలెండర్ హామీని తుంగలో తొక్కేశారు. నోటిఫికేషన్లు విడుదల చేయలేదు. నిరుద్యోగ యువత జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో సుమారు లక్షకు పైగా నాన్ గెజిటెడ్, మరో 50 వేలకు పైగా గెజిటెడ్, 60 వేల ఉపాధ్యాయ పోస్టులకు ఈ ఏడాదిలోనే నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేయాలి. నిరుద్యోగులను మోసం చేయాలని చూస్తే పోరాటం తప్పదు.

– రవి, ఎస్ఎఫ్ఐ, జిల్లా కార్యదర్శి, తిరుపతి

మాట నిలబెట్టుకోవాలి



జిల్లాలో వేలమంది నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్ కోసం ఎదురు చూస్తున్నారు. పుస్తకాల పురుగుల్లా రోజుకు 10 గంటలకు పైగా లైబ్రరీలు, రీడింగ్ రూమ్‌లకే అంకితమవుతున్నారు. నూతన ఏడాదిలో నోటిఫికేషన్లు విడుదల చేస్తారనే నమ్మకంతో ఎదురు చూస్తున్నాం. నిరుద్యోగులకు లోకేష్ అన్న ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. జిల్లాలో యువతకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదు.

– శ్రీలత, ఎమ్మెస్సీ, బీఈడీ, తిరుపతి

నోటిఫికేషన్లు లేవు



మంత్రి లోకేష్ ఎన్నికల ముందు చేపట్టిన యువగళం పాదయాత్రకు నేనూ హాజరయ్యా. నిరుద్యోగ యువతను ఆదుకుంటానని, ఏటా జనవరి ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు సంబంధించిన జాబ్ క్యాలెండర్ విడుదల చేసి తీరుతా.. రాసుకోండి అంటూ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక నోటిఫికేషన్లు లేవు. నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదు. పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసి అధ్యాపక పోస్టుల భర్తీ కోసం ఎదురు చూస్తున్నా. ఇప్పటి వరకు ఎలాంటి భరోసా లేదు. అసలు భర్తీ చేస్తారా లేదా తెలియదు.

– సుదర్శన్, ఎంఏ, పీహెచ్‌డీ, తిరుపతి రూరల్

అప్పు చేసి కోచింగ్



ప్రభుత్వ ఉద్యోగాల కోసం గత ఏడు నెలలుగా ఎదురు చూస్తున్నాం. అప్పు చేసి రూ.లక్షలు వెచ్చించి కోచింగ్ తీసుకుంటున్నాం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం జాబ్ క్యాలెండర్ జనవరి ఒకటో తేదీన విడుదలవుతుందని ఎంతో ఆశతో ఎదురు చూశాం. నిరాశే మిగిలింది. గ్రూప్–2 మెయిన్స్ పరీక్షల తేదీలను ప్రకటించడంలో కూడా జాప్యం చేస్తున్నారు. గ్రూప్–1 నోటిఫికేషన్‌ను జాబ్ క్యాలెండర్‌లో పొందుపరిచి వెంటనే విడుదల చేయాలి.

– నరేంద్ర, ఎమ్మెస్సీ, తిరుపతి

ఊరు పిలుస్తోంది!



పొట్టకూటి కోసం.. ఉపాధి అవసరాల నిమిత్తం ఎక్కడెక్కడో పనిచేస్తుంటారు. కొందరు ఒంటరిగా.. ఇంకొందరు కుటుంబాలతో వెళ్లి ఊరుగాని ఊర్లో పనిచేస్తుంటారు. సంక్రాంతి పండుగ నాటికి తమ స్వగ్రామాలకు చేరుకుని సంబరాలు చేసుకుంటారు. బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి ఎంచక్కా పండగ చేసుకుంటారు. ఈ క్రమంలోనే మరో రెండు రోజుల్లో సంక్రాంతి పండుగ వస్తున్న నేపథ్యంలో తిరుపతి బస్టాండ్ కిక్కిరిసింది. శుక్రవారం ప్రయాణికులతో కిటకిటలాడింది. బస్సు ఎక్కడానికి, సీట్ల కోసం పోటీ పడడం కనిపించింది.

– సాక్షి, తిరుపతి ఫొటో గ్రాఫర్







ముగిసిన శిక్షణ



ఢిల్లీ హైకోర్టు న్యాయవాది నగీన జైన్‌ను సన్మానిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి మల్లీశ్వరి

తిరుపతి లీగల్ : రాయలసీమ జిల్లాల్లోని 25 మంది న్యాయమూర్తులకు గత ఐదు రోజులుగా మధ్యవర్తిత్వంపై నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. శిక్షణ ఇచ్చిన ఢిల్లీ హైకోర్టు రిటైర్డ్ జడ్జి, సీనియర్ ట్రైని డాక్టర్ సుధీర్‌కుమార్ జైన్, ఢిల్లీ హైకోర్టు న్యాయవాది, సీనియర్ ట్రైనీ నగీనజైన్‌లను అనంతపురం 8వ అదనపు జిల్లా జడ్జి బీ.సాదుబాబు, కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ టీ.మల్లీశ్వరి సన్మానించారు. రాష్ట్ర న్యాయ సేవ సంస్థ, ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవా సంస్థ, తిరుపతి మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు, కర్నూలు, వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాలకు చెందిన 25 మంది న్యాయమూర్తులకు సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ కమిటీ శిక్షణ ఇచ్చింది. ఈ శిక్షణా తరగతులు తిరుపతి శ్వేత భవనంలో గత ఐదు రోజులుగా జరిగాయి.

న్యాయవాదులతో సమావేశం

మధ్యవర్తిత్వంపై శిక్షణ ఇవ్వడానికి వచ్చిన ఇద్దరు సీనియర్ ట్రైనీలు తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ హాల్లో న్యాయవాదులతో సమావేశమయ్యారు. కేసులను పరిష్కరించడం వల్ల న్యాయవాదులకు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. తిరుపతి న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు టీ.గోపీచంద్, ప్రధాన కార్యదర్శి మార్టిన్, మహిళా మెంబర్ వసుమతి, ఢిల్లీ హైకోర్టు న్యాయవాది నగీన జైన్ పాల్గొన్నారు.

విద్యార్థి దశలో క్రీడలూ ముఖ్యమే



ప్రతిభ చూపిన విద్యార్థులకు చాంపియన్ ట్రోఫీ, బహుమతులను అందజేస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: విద్యార్థి దశలో అకడమిక్ విద్యతో పాటు క్రీడలు భాగం కావాలని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ జేవీ రమణ అభిప్రాయపడ్డారు. గత ఐదు రోజులుగా ఎస్వీ వెటర్నరీ కళాశాల ప్రాంగణంలో జరిగిన 13వ వెటర్నరీ అంతర్ కళాశాల సౌత్‌జోన్ క్రీడా సాంస్కృతిక పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలు చాంపియన్ ట్రోఫీలు, బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెటర్నరీ వర్సిటీ క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. పోటీలలో భాగంగా తిరుపతి ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు బాల్ బ్యాడ్మింటన్, షటిల్, క్రికెట్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్ బాల్, చెస్ విభాగాలలో ప్రతిభ చూపి ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచారు. పరిశోధక సంచాలకులు శ్రీలత, డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య, వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య, డెయిరీ కళాశాల డీన్ డాక్టర్ నాగేశ్వరరావు, పీడీలు పాల్గొన్నారు.

వర్సిటీలో చిరుత.. జంటలూ జాగ్రత్త !



రిజిస్ట్రార్‌కు సమాచార పత్రాన్ని అందజేస్తున్న అటవీశాఖ అధికారులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో చిరుత కదలికలనూ ప్రత్యేకంగా అమర్చిన 10 సీసీ కెమెరాల ద్వారా గుర్తించినట్టు ఫారెస్ట్ అధికారులు ఎఫ్ఆర్ఓ సుదర్శన్, వన్యప్రాణి జీవశాస్త్రవేత్త సౌజన్య తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడును కలిసి వర్సిటీ ప్రాంగణంలో చిరుత కదలికలపై పూర్తి సమాచారాన్ని అందించారు. అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ వర్సిటీలో ప్రధానంగా రాత్రి ఒంటిగంట సమయంలో జంటలు జంటలుగా తిరుగుతున్నారని జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. క్యాంటీన్ల వద్ద ఆహార వ్యర్థాల నిర్వహణ సరిగా లేదని, దీంతో వీధి కుక్కల సంఖ్య పెరుగుతోందని తెలిపారు. వర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు, పాదచారులు, వర్సిటీలోకి వచ్చే బయటి వ్యక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి 8 నుంచి ఉదయం 7 గంటల వరకు వర్సిటీలో తిరగకూడదని, ఎక్కడబడితే అక్కడ కూర్చోకూడదని స్పష్టం చేశారు. చిరుత తనకన్నా చిన్న సైజు కలిగిన జంతువులను, కుక్కలను, జింకలను, ఆవులు, గేదెలను ఆహారంగా తీసుకెళుతుందన్నారు. వర్సిటీలో కుక్కల బెడద చిరుతకు మంచి అవకాశంగా చేసుకుందని, వ్యర్థ ఆహార పదార్థాల నిర్వహణను క్యాంటీన్ల వద్ద, హాస్టల్లో విధిగా పాటించాలని చెప్పారు. కుక్కల కోసం పాదచారులు ఆహారాన్ని అందించకూడదన్నారు. జాగ్రత్త పట్టికలను ఏర్పాటుచేసి అందులో ఈ మెయిల్స్ వాట్సాప్, ఫోన్ నంబర్ల వివరాలు ఉంచాల ని సూచించారు. వర్సిటీకి అడవి దగ్గరగా ఉండడం వల్ల ఇక్కడ నివాసం ఉండేవారు పెంపుడు జంతువులు పెంచుకోకూడదని సూచించారు. చిరుత సంచారాన్ని గుర్తిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

క్లుప్తంగా

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు


మురళీమోహన్

తిరుపతి మంగళం : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రైవేటు బస్సుల్లో అధిక చార్జీ వసూలు చేసినా, ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా శాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ వాహనాలకు సంబంధించి సరైన రికార్డులు లేకపోయినా, నిబంధనలకు విరుద్ధంగా బస్సులు తిరుగుతున్నా సీజ్ చేస్తామన్నారు. సంక్రాంతి సందర్భంగా తిరుపతి జిల్లాలోని ఐదు కార్యాలయ అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలతో ప్రైవేటు బస్సుల తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలు 10 రోజులపాటు కొనసాగుతాయని, వాణిజ్య పరమైన వస్తువులను బస్సుల్లో తరలించకూడదని, ప్రయాణికుల్ని సురక్షితంగా గమ్యం చేర్చాల్సిన బాధ్యత బస్సుల యాజమాన్యం, డ్రైవర్లపై ఉందన్నారు. ముఖ్యంగా కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సుల డ్రైవర్లు మద్యం తాగి వాహనాల్ని నడపరాదని, తనిఖీల్లో పట్టుబడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హైకోర్టు న్యాయమూర్తికి సన్మానం


హైకోర్టు న్యాయమూర్తిని సన్మానిస్తున్న గ్రామస్తులు

సత్యవేడు : సంక్రాంతి పండుగ కోసం స్వగ్రామమైన సత్యవేడుకు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి తూట చంద్ర ధనశేఖర్‌ను శుక్రవారం స్థానికులు సన్మానించారు. తూట చంద్ర ధనశేఖర్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన తర్వాత మొదటి సారి శుక్రవారం స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన అభినందలు, ముందస్తుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జే.పాండురంగయ్య, ఎం.శివయ్య, ఏరాసి మురళి, కళ్లూరు ప్రసాద్, పృధ్వి విక్రం, పోజల రవిబాబు, మన్ని భాస్కర్, చెంచుబాబు, హరి, గణ పాల్గొన్నారు.

ఇల్లు కూల్చివేయడంతో గుండెపోటు


చికిత్స పొందుతున్న శివరామిరెడ్డి

వెంకటగిరి రూరల్: వెంకటగిరి పట్టణంలోని 9వ వార్డు ఉపాధ్యాయనగర్‌లో ఈనెల 4వ తేదీన మున్సిపల్ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య ఇల్లు కూల్చివేసిన ఘటనపై ఆ ప్రాంతానికి చెందిన బాధితుడు చిల్లకూరు శివరామిరెడ్డి శుక్రవారం గుండెపోటుకు గురైనట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. చాలా ఏళ్ల క్రితం పట్టాతో కలిగిన స్థలం కొనుగోలుచేసి ఇల్లు నిర్మాణం చేపట్టామని, అయితే రాజకీయ కారణాలతో తమ ఇల్లు కూల్చివేశారని ఆరోపించారు. కష్టపడి నిర్మించుకున్న ఇంటిని కళ్లెదుటే కూల్చివేయడంతో అప్పటి నుంచి చిల్లకూరు శివరామిరెడ్డి ఆందోళనకు గురయ్యాడని, శుక్రవారం ఉదయం గుండెపోటుతో అస్వస్థతకు గురయ్యాడని తెలిపారు.

ఆకట్టుకున్న పుష్పాలంకరణ



ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు



ఉత్తర ద్వారంగుండా ఆలయంలోకి వెళ్తున్న మోహిత్‌రెడ్డి



అదిగో భూలోక వైకుంఠం!

- తుమ్మలగుంట కల్యాణ వెంకన్న ఆలయంలో కనుల పండువగా ఉత్తర ద్వార దర్శనం
- ప్రత్యేక పూజలతో తెరుచుకున్న సప్త ద్వారాలు
- ఆకట్టుకున్న ఆనందనిలయం, గరుడ ద్వారం
- 70 వేల మందికి పైగా భక్తులు వైకుంఠ ద్వార ప్రవేశం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఏర్పాట్లపై చెవిరెడ్డి సమీక్ష


ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు

తిరుపతి రూరల్: అదిగదిగో.. భూలోక వైకుంఠం ..ఆ వైకుంఠంలో కొలువు దీరిన శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వైభవాన్ని వేలాది మంది భక్తులు దర్శించారు. దేవదేవుడు కొలువు దీరిన తిరుమల కొండలకు ఆనుకుని భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న తుమ్మలగుంట క్షేత్రంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో వైకుంఠ ఏకాదశి వేడుకలు అంబరాన్ని తాకాయి. వైకుంఠ ఏకాదశి పర్వదినాన శ్రీహరిని దర్శిస్తే సకల శుభాలు కలుగుతాయని ప్రతీతి. తిరుమల వెళ్లి స్వామిని దర్శించలేని భక్తులు తుమ్మలగుంట చేరుకుని స్వామివారిని దర్శించుకుంటారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆయం వద్ద భక్తుల హృదయాలను హత్తుకునేలా భారీ సెట్టింగ్‌లను ఏర్పాటు చేశారు. ఆలయంతో పాటు వైకుంఠ ద్వారాన్ని సుంగదభరిత పుష్పాలు, పరిమళ భరిత పత్రాలతో అలంకరించారు. ముందుగా బ్రహ్మోత్సవాల్లో స్వామి వారు అధిరోహించే వాహనాలను దర్శించుకునే భక్తులు ఆపై సప్తద్వారాల గుండా ఆనంద నిలయం నీడలో ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆపై స్వామిని దర్శించుకుని వైకుంఠ ద్వార ప్రవేశం చేసి తమ కోరికలను స్వామికి నివేదించుకున్నారు. ప్రముఖులతో పాటుగా సాధారణ భక్తులు సైతం వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు.

తెరుచుకున్న సప్త ద్వారాలు

కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి దర్శనార్థం భక్తులు రాగానే ఆలయానికి అతి సమీపంలో ఏర్పాటు చేసిన సప్త ద్వారాలు తెరుచుకున్నాయి. అంతకుముందు అర్చక స్వాములు సప్త ద్వారాలు, ఆనంద నిలయం, గరుడ ద్వారానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైకుంఠ ద్వార దర్శనానికి వచ్చే భక్తులు అక్కడ ఏర్పాటు చేసిన సప్త ద్వారాలు, ఆనంద నిలయం, గరుడ ద్వారాలను చూసి పరవశించిపోయారు.

అంగరంగ వైభవం

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తిరుమల తరహాలో ఆగమ శాస్త్రం ప్రకారం వైకుంఠ ద్వారానికి పూజలు చేసి ప్రారంభించారు. అంతకుముందు స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చన వంటి దైనందిన పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం భక్తులను వైకుంఠ ద్వార ప్రవేశానికి అనుమతించారు. తెల్లవారు జామున 2 గంటల నుంచే తుమ్మలగుంట ఆలయం వద్దకు భక్తులు చేరుకోవడం, గంట గంటకూ భక్తుల తాకిడి పెరుగుతుండడంతో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులుతో పాటు ఆయన కుమారులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి దగ్గరుండి క్యూలైన్లను పర్యవేక్షించారు. సామాన్య భక్తులకు సులభంగా దర్శనం కలిగించేలా చర్యలు తీసుకున్నారు.

ఆకట్టుకున్న పుష్పాలంకరణ

వైకుంఠ ఏకాదశి పర్వదినాన నిజమైన వైకుంఠాన్ని తలపించేలా తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ప్రత్యేకంగా దేశ, విదేశాల నుంచి తీసుకొచ్చిన పది టన్నుల పుష్పాలతో చూడముచ్చటగా అలంకరించారు. దీనికి విద్యుత్ కాంతులు తోడవడంతో ఆలయ పరిసరాలు వెలిగి పోతున్నాయి.

70 వేల మందికిపైగా దర్శనం

వైకుంఠ ఏకాదశి పర్వదినాన సుమారు 70 వేల మందికిపైగా భక్తులు శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించి వైకుంఠ ద్వారంలో ప్రవేశించారు. సాదారణ భక్తులతో పాటు తిరుపతి, చుట్టు పక్కల నియోజకవర్గాల నుంచి పలువురు ప్రముఖులు కుటుంబ సమేతంగా తరలి వచ్చారు. వీఐపీల దర్శన సమయంలో కూడా సాధారణ భక్తులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

వివిధ రకాల ఆకారాలలో ఏర్పాటు చేసిన పుష్పాలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. వైకుంఠ ద్వారంతో పాటు ప్రధాన ఆలయం లోపల, బయట, ధ్వజస్తంభం పరిసర ప్రాంతాల్లో ఆకర్షణీయమైన పుష్పాలతో రకరకాల ఆకృతులతో అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అలరించిన నృత్యాలు

శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం ముందు ఏర్పాటు చేసిన కళావేదికపై విజయవాడ నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, అన్నమయ్య సంకీర్తనలు భక్తులకు కనువిందు చేశాయి. చిన్నారుల దేవతా మూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.



జ్యోతీనగర్ వాసులకు హైకోర్టులో ఊరట


రేణిగుంట జ్యోతీనగర్‌లోని ఇళ్లు

రేణిగుంట: రేణిగుంట జ్యోతీనగర్ సర్వే నంబరు 453–6లో నిర్మించిన 33 ఇళ్ల లబ్ధిదారులు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌కు ఊరట లభించింది. అధికారులు ఇళ్ల కూల్చివేత ప్రయత్నాలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించింది. నాలుగు వారాల్లో పూర్తి వివరాలతో కౌంటర్ ఫైల్ దాఖలు చేయాలని సూచించింది. జ్యోతీనగర్‌కు చెందిన 33 మంది దళితులు ఇళ్లను నిర్మించుకుని పంచాయతీ నుంచి ఎన్‌వోసీ, విద్యుత్ కనెక్షన్లు పొందినట్లు బాధితులు కోర్టుకు వివరించారు. అయితే మండలంలోని రెవెన్యూ అధికారులు ఎలాంటి నోటీసులు లేకుండా అర్ధరాత్రి వేళ కూల్చివేత కార్యక్రమాలను చేపట్టారు. ఇప్పటికే చెంగారెడ్డిపల్లి సర్వే నంబరు 535లో ఎస్టీలకు చెందిన ఇళ్లను కూల్చివేసిన ఘటనలో సంబంధిత అధికారులందరిపై కోర్టు ధిక్కారణ పిటిషన్ కూడా దాఖలైనట్లు తెలుస్తోంది. కేవలం అణగారిన వర్గాలకు చెందిన ఇళ్లను మాత్రమే అక్రమంగా కూల్చివేతకు పాల్పడుతున్నారని వారు భయాందోళన చెందారు. దీంతోనే తాము ఆ ఇళ్లకు సంబంధించి తమ వద్ద నున్న పత్రాలతో హైకోర్టును ఆశ్రయిస్తే తాత్కాలిక స్టే విధించినట్లు తెలిపారు.

బాలబాలికల హాకీ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో శనివారం ఉదయం 7.30గంటలకు హాకీ సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు. ఆ మేరకు తిరుపతి జిల్లా హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి బి.ఆదిత్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్స్ 01-01-2007 తరువాత, జూనియర్స్‌కు 01-01-2009 తరువాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, 1పాస్‌పోర్ట్ సైజు ఫొటోను తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన సబ్ జూనియర్ బాలుర జట్టు ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు మదనపల్లెలో, బాలికల జట్టు ఈ నెల 27నుంచి 29వ తేదీ వరకు అనంతపురంలో నిర్వహించే 14వ రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. జూనియర్ హాకీ పోటీల తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 70131 77413ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఎంబీయూలో ఘనంగా స్పోర్ట్స్ డే


సన్మాన కార్యక్రమంలో ఎంబీయూ చాన్స్‌లర్, మంచు మోహన్‌బాబు, ప్రో చాన్స్‌లర్ విష్ణు

చంద్రగిరి: మండల పరిధిలోని శ్రీసాయినాథ నగర్‌లో వెలసిన ఎంబీ యూనివర్సిటీ, శ్రీవిద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం వార్షిక స్పోర్ట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ మంత్రి కొండా సురేఖ, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి ఎంబీయూ చాన్స్‌లర్ డాక్టర్ మంచు మోహన్‌బాబు, ప్రో చాన్స్‌లర్ మంచు విష్ణు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్పోర్ట్స్ డే జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ విద్యార్థులు పలు నృత్యాలను ప్రదర్శించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో ప్రతి ఒక్కరూ రాణించాలన్నారు. ఇక్కడ 25శాతం పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించడం ఆదర్శనీయమన్నారు. విజేతలకు మోహన్‌బాబు, కొండా సురేఖ, మంచు విష్ణు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం వారు కొండా సురేఖను ఘనంగా సత్కరించారు. ఎంబీయూ ప్రోవోస్ట్ నాగరాజ రామారావు, వీసీ కరుణాకిరణ్, రిజిస్ట్రార్ సారథి, డీఎఫ్‌ఏ రవిశేఖర్ పాల్గొన్నారు.

అట్టహాసంగా ఫ్రెషర్‌డే వేడుకలు

ఎంబీయూలో నూతనంగా ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు హాజరయ్యారు. లైబ్రరీ, సెంట్రల్ కిచెన్, ఇండోర్ స్టేడియం ప్రపంచ స్థాయిలో ఉన్నాయన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రేపు జిల్లాకు సీఎం చంద్రబాబు


సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: జిల్లాకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదివారం వస్తున్నారని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లో తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్యతో కలసి అధికారులతో సీఎం పర్యటనపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం సీఎం తిరుపతి నగరంలోని ఏజీ అండ్ పీ గ్యాస్ వారి కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, తిరుపతి ఆర్డీవో రామమోహన్, జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, జిల్లా సివిల్ సప్లయ్స్ అధికారి శేషాచలం రాజు, తిరుపతి కార్పొరేషన్, వైద్య విభాగానికి చెందిన అధికారులు పాల్గొన్నారు.

మృత దేహం లభ్యం


సముంద్రం ఒడ్డున ఉన్న స్నేహితులు, బంధువులు

వాకాడు : ఆరుగురు స్నేహితులు సరదాగా సముద్రస్నానానికి వెళ్లి వారిలో ఇద్దరు విద్యార్థులు గురువారం గల్లంతైన విషయం తెలిసిందే. దీంతో గల్లంతైన వారి కోసం గాలింపు చేపట్టాగా వారిలో ఒకరి మృత దేహం శుక్రవారం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. మల్లాంలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్న ఆరుగురు విద్యార్థులు సరదాగా సముద్ర స్నానానికని తూపిలిపాళెం వెళ్లగా.. వారిలో ఓడపాళెం(వైట్ కుప్పం)కు చెందిన మోమిడి లోకేష్, చిట్టమూరు మండలం కొక్కుపాళెంకు చెందిన ఇంగిలాల భానుప్రకాష్ గల్లంతయ్యారు. దీంతో మేరైన్, వాకాడు పోలీసులు, మత్స్యకారులు 36 గంటల పాటు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో తూపిలిపాళెం చివరి ప్రాంతంలోని సముద్రం ఒడ్డుకు లోకేష్ మృత దేహం కొట్టుకు వచ్చింది. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని బాలిరెడ్డిపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భానుప్రకాష్ కోసం ఇంకా గాలింపు చేపడుతున్నారు.

విడ‘తీయని’ బంధం

– భర్త మరణాన్ని తట్టుకోలేక భార్య మృతి


మృతి చెందిన భార్యాభర్తలు

కోట: ఎంతో అన్యోన్యంగా జీవించిన వృద్ధ దంపతులు, ఒకరిని విడిచి మరొకరు ఉండలేక గంటల వ్యవధిలోనే ప్రాణాలు వదిలిన ఘటన కోట మండలం, తిన్నెలపూడిలో చోటుచేసుకుంది. న్నెలపూడికి చెందిన మన్నె సుబ్బరామయ్య(80) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో శుక్రవారం కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు. తనకు తోడూనీడగా నిలిచిన భర్త మృతిని తట్టుకోలేని భార్య శేషమ్మ(75) ఆయన మృతదేహం వద్ద రోదిస్తూ శుక్రవారం ఉదయం ప్రాణాలు విడిచింది. వీరికి ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ గంటల వ్యవధిలోనే మృతి చెందడంతో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇద్దరికి ఒకేసారి అంత్యక్రియలు పూర్తిచేశారు.

ఉపాధి ఏపీఓ సస్పెన్షన్

సత్యవేడు: మండల పరిధిలో ఉపాధి ఏపీఓ కృష్ణయ్యను, ఎంటీఏ సుమలతను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. మండలానికి 60 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. అందులో 50 పూర్తిచేయాల్సి ఉండగా.. అందుకు తగ్గా విధంగా నిర్మించకపోవడంతో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

నిందితుడికి ఏడాది జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం దుంగల అక్రమ రవాణా కేసులో కోట మండలం, రామాపురానికి చెందిన వై. వెంకటేశ్వర్లుకు ఏడాది జైలు శిక్ష, 24 వేల రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం సెషన్స్ కేసుల విచారణ కోర్టు జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం.. 2011లో నిందితుడు వెంకటేశ్వర్లు మరొకరితో కలిసి కృష్ణాపురం, కరకంబాడి బీట్, అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి ఎర్రచందనం చెట్లను నరికి దుంగలను తరలిస్తుండగా ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి తిరుపతి ఐదవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచారు. కేసు విచారణ దశలో వెంకటేశ్వర్లతో పాటు అరెస్టయిన నిందితుడు కోర్టుకు హాజరు కాలేదు. దీంతో న్యాయమూర్తి అతన్ని నాన్ బెయిలబుల్ వారెంట్ పై అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచాలని ఆదేశాలు జారీచేశారు. వెంకటేశ్వర్లు పై మాత్రం కేసు విచారణ జరిగింది. నేరం అతనిపై రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కేసులో రెండో నిందితుడుగా ఉన్న వ్యక్తిని 2013 నుంచి ఇప్పటివరకు అరెస్టు చేయలేకపోవడంతో అతనిపై నాన్ బెయిలబుల్ వారంట్ పెండింగ్లో ఉండడం విశేషం.

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో పలువురి నియామకం

చిత్తూరు అర్బన్: వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లా కమిటీలో పలువురికి పలు హోదాల్లో నియామకం కల్పిస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్(చిత్తూరు), కె కోదండరెడ్డి (కుప్పం), శాంతిసాగర్‌రెడ్డి (పూతలపట్టు), గురవరెడ్డి (గంగాధరనెల్లూరు), బీడీ భాస్కర్ (నగరి), సాయిక్ ముజమ్మిల్ (పలమనేరు), దామోదరరాజు (పుంగనూరు), ముస్తూరు రవి (తిరుపతి), ధనుంజయ్యరెడ్డి (సత్యవేడు) నియమితులయ్యారు. అలాగే జిల్లా ప్రధాన కార్యదర్శులుగా వేలకచర్ల గోపాల్‌రెడ్డి(తిరుపతి), టీజీ మహేశ్వర్ నాయుడు (చిత్తూరు), ఎస్‌కే మురవత్ భాషా(పుంగనూరు), దయాసాగర్‌రెడ్డి (గంగాధరనెల్లూరు), టి. అనిల్‌కుమార్ (నగరి) నియమితులయ్యారు. అలాగే పార్టీ జిల్లా కోశాధికారిగా తిరుమల శెట్టి వెంకటేశ్వరరావు(తిరుపతి), కార్యనిర్వాహక కార్యదర్శిగా కరేటి శ్రీను (తిరుపతి), బత్తిన బాబు (తిరుపతి), ఎస్ఎస్ రజనీకాంత్ (చిత్తూరు), జె దిలీప్‌కుమార్ (చిత్తూరు), సుబ్బన్న యాదవ్ (పుంగనూరు), ఉదయ్‌కుమార్‌రెడ్డి (పుంగనూరు), లక్ష్మణ్‌రెడ్డి (పలమనేరు), రాధాకృష్ణ(పలమనేరు), ఎం వెంకటేష్ (కుప్పం), సౌకత్ అల్లీ(కుప్పం), గోవిందస్వామి(పూతలపట్టు), జయచంద్రారెడ్డి(పూతలపట్టు), ఆర్ బాలాజీ(గంగాధరనెల్లూరు), రామయ్య(గంగాధరనెల్లూరు), లీలారామన్(నగరి), చిరంజీవి(నగరి) నియమితులయ్యారు. క్రియాశీలక కార్యదర్శులుగా రామక్రిష్ణారెడ్డి (పుంగనూరు), వెంకటరమణ(పుంగనూరు), శంకరప్ప(పలమనేరు), బాబు(పలమనేరు), టి కుమార్ (చిత్తూరు), టి కృష్ణమూర్తిరెడ్డి(చిత్తూరు), ఆర్ చలపతి (కుప్పం), మురుగేష్(కుప్పం), జయచంద్రారెడ్డి(పూతలపట్టు), కిషోర్‌రెడ్డి (పూతలపట్టు), కుప్పయ్య (గంగాధరనెల్లూరు), విజయ్‌కుమార్ (గంగాధరనెల్లూరు), టీసీ మురగయ్య(నగరి), మాధవ వర్మ(నగరి), సి.జగదీష్ రెడ్డి(సత్యవేడు), లాల్‌బాబ్ యాదవ్(సత్యవేడు), జె.గోపాల్‌రెడ్డి(సత్యవేడు), రాకేష్ కిరణ్(సత్యవేడు), దశనం ప్రసాద్‌రాజు(తిరుపతి), ఎ కోటి (తిరుపతి) నియమితులయ్యారు. అధికార ప్రతినిధులుగా రాజశేఖర్‌రెడ్డి (పుంగనూరు), రంగనాథం(పలమనేరు), గాయత్రీదేవి(చిత్తూరు), భాస్కర్ నాయక్ (కుప్పం), కోదండన్(గంగాధరనెల్లూరు), నల్లప్ప రెడ్డి సుధాకర్ రెడ్డి(పూతలపట్టు), చెంచు రమణరాజు(నగరి), వెంకటయ్య అలియాస్ చిన్న(సత్యవేడు),పసుపులేటి సురేష్ రాయల్(తిరుపతి), యాచం వాసుదేవయాదవ్(తిరుపతి)లను నియమించినట్లు పార్టీ కార్యాలయం వెల్లడించింది.

వైభవంగా వైకుంఠ ఏకాదశి


క్యూలో వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు శుక్రవారం వైభవంగా సాగాయి. భక్తులు తెల్లవారు జామునుంచే వైష్ణవ ఆలయాల్లో బారులు తీరారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వరదరాజస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ అధికారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి స్వామివారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.